క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గజపతినగరం: మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో బొబ్బిలి డివిజన్ కార్యనిర్వాహక ఇంజినీర్ ఎ. అనంతరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని మధుపాడ, మరుపల్లి, తమ్మారాయుడు పేట, ఎం.గుమడాం, తదితర గ్రామాల్లో సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పోస్టల్ ఇన్సూరెన్స్‌ను సద్వినియోగం చేసుకోండి



పోస్టల్ సేవలను వివరిస్తున్న ఐపీఓ ఉపేంద్ర

బొండపల్లి: పోస్టల్ శాఖ ద్వారా అమలు చేస్తున్న జీవిత బీమాను ప్రజలందరూ సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత గ్రామాల్లోని పోస్టల్ శాఖ సిబ్బందిపై ఉందని గజపతినగరం పోస్టల్ ఇన్‌స్పెక్టర్ బొద్దుల ఉపేంద్ర సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండలంలోని బీపీఎంలు, పోస్టల్ శాఖ సిబ్బందితో సమావేశమై పోస్టల్ శాఖ అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. ఇతర జీవిత బీమా కంపెనీలు అందిస్తున్న సౌకర్యాలు కన్నా పోస్టల్ శాఖ మరింత మెరుగైన సేవలు అందిస్తోందని చెప్పారు. ఈ విషయాలను గ్రామస్తులకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో ఇండియా పోస్ట్ పేమెంట్ డివిజన్ మేనేజర్ సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

సహాయ ప్రభుత్వ న్యాయవాదిగా సూర్యనారాయణ



చీపురుపల్లి: ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా పట్టణంలోని జి.అగ్రహారంనకు చెందిన సీనియర్ న్యాయవాది మండల సూర్యనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు లీగల్ అండ్ లెజిస్లేటివ్ అఫైర్స్ అండ్ జస్టిస్ ప్రభుత్వ కార్యదర్శి గొట్టాపు ప్రతిభాదేవి నుంచి గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఎంతో కాలంగా చీపురుపల్లి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో న్యాయవాదిగా విధులు నిర్వహిస్తున్న మండల సూర్యనారాయణను ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా నియమించడం పట్ల స్థానిక న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం తనపై ఉంచిన నమ్మకంతో బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తానని తెలిపారు.

ఘనంగా ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం



ముత్యాలమ్మ

బొండపల్లి: మండలంలోని దేవుపల్లిలో ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. అర్చకుడు దూసి శ్రీధర్ శర్మ ఆధ్వర్యంలో పూర్ణ కలశ ప్రతిష్ఠ జరిగింది. కార్యక్రమంలో గ్రామానికి చెందిన పెద్దలు, నిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమ్మె విజయవంతం చేయండి



వేతనదారులతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు

కొత్తవలస: ఈ నెల 20న చేపట్టనున్న జాతీయ సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు గాడి అప్పారావు, మద్దిల రమణ కోరారు. మండలంలోని కొత్త సుంకరపాలెం చెరువులో జరుగుతున్న ఉపాధి పనులను గురువారం వారు సందర్శించి వేతనదారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉపాధి హామీ చట్టాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తూట్లు పొడుస్తున్నాయని ఆరోపించారు. అసంఘటిత రంగ కార్మికుల శ్రేయస్సుకై నిర్వహించనున్న సమ్మెలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

మట్టి తవ్వకాలకు అనుమతి తప్పనిసరి

దత్తిరాజేరు: చెరువులు, కాలువుల్లో మట్టి తవ్వకాలకు ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ వరప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పొలాలకు మట్టి కావాలనుకునే రైతులు ఆయా శాఖాధికారుల నుంచి అనుమతి తీసుకుని తరలించుకోవాలని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారుల అనుమతి లేకుండా తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవన్నారు.

పొంచి ఉన్న ప్రమాదాలు..

- ప్రమాదకరంగా మలుపులు, కల్వర్టులు
- ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా తప్పని ముప్పు



గర్భాం - గరివిడి ప్రధాన రహదారిలో ప్రమాదకర మలుపు

మెరకముడిదాం: మండలంలోని గర్భాం నుంచి గరివిడి వెళ్లే ప్రధాన రహదారిలో పలు మలుపులు ప్రమాదాలకు పిలుపులుగా మారాయి. ఇందులో గర్భాం ఆంధ్రా ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమకి కొత్త పెట్రోల్‌బంక్‌కు మధ్యలో ఉన్న మలుపు.. చినబంటుపల్లి జంక్షన్ ముందున్న ములుపు.. చినబంటుపల్లి జంక్షన్ దాటిన తర్వాత దేవునికనపాక వెళ్లే రహదారి వద్ద ఉన్న మలుపు.. రేగటి సుద్దగని కొబ్బరితోట వద్ద ఉన్న మలుపులు అత్యంత ప్రమాదకరంగా తయారయ్యాయి. ఆయా రహదారుల్లో ప్రతిరోజూ వందలాది వాహనాలు రోకపోకలు సాగిస్తుంటాయి. మలుపుల వద్ద పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఏమాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా ప్రాణాల మీద ఆశ వదులుకోవాల్సిందేనని వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి మలుపుల వద్ద జంగిల్ క్లియరెన్స్ చేపట్టడంతో పాటు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు.

ఆదమరిస్తే అంతే ....



సోలిపి సోమరాజు పేట వద్ద రక్షణ గోడ లేకుండా ఉన్న కల్వర్టు

గుర్ల: మండలంలోని సోలిపి సోమరాజుపేట వద్ద వల్లాపురం బీటీ రోడ్డును ఆనుకుని ఉన్న కల్వర్టు రక్షణగోడ పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. రక్షణ గోడ పడిపోవడంతో రాత్రి సమయంలో ప్రయాణిస్తున్న వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నా.. సంబంధిత అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రక్షణ గోడ నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు



కొవ్వాడపేటలో ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

బొండపల్లి: మండలంలోని కొవ్వాడపేట ప్రధాన రోడ్డుపై ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదకరంగా తయారైంది. దీంతో రాకపోకలకు వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. పంచాయతీ అధికారులు ప్రతిరోజూ గ్రామంలో పర్యటిస్తున్నా.. సమస్యను మాత్రం గుర్తించకపోవడం బాధాకరం. కాలువపై వేసిన సిమెంట్ పలకలు పూర్తిగా ముక్కలు కావడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

రోడ్డుపైకి మురుగునీరు..



గంట్యాడ మండలంలోని సిరిపురంలో డ్రైనేజీలు లేకపోవడంతో రోడ్డుపైనే మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో దుర్వాసన భరించలేకపోతున్నామని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దోమల బెడద వల్ల అంటురోగాలు ప్రబలుతున్నాయని వాపోతున్నారు. అధికారులు స్పందించి మురుగు నివారణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

– గంట్యాడ

నిరుపయోగంగా చెత్త సంపద కేంద్రం..



వేపాడ మండలంలోని దబ్బిరాజుపేట గ్రామంలో గత టీడీపీ హయాంలో ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రం నిరుపయోగంగా మారింది. గ్రామం మధ్యలో కేంద్రం ఏర్పాటు చేయడంతో ఎవ్వరూ చెత్త వేయడం లేదు. దీంతో స్థానికులు తమ వాహనాలు పార్క్ చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి చెత్త సంపద కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

– వేపాడ

ఎస్‌జీటీలకు అన్యాయం చేయొద్దు..

- పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆల్తి రాంబాబు



చినబంటుపల్లిలో విలేకరులతో మాట్లాడుతున్న ఆల్తి రాంబాబు, తదితరులు

మెరకముడిదాం: మోడల్ ప్రైమరీ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లను హెచ్ఎంలుగా నియమిస్తూ.. ప్రైమరీ పాఠశాలల్లో పనిచేసున్నన్న ఎస్‌జీటీలకు అన్యాయం చేయడం తగదని పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ఆల్తి రాంబాబు అన్నారు. మండలంలోని చినబంటుపల్లి ప్రాథమిక పాఠశాలలో పీఆర్‌టీయూ మిత్ర సంఘాల నాయకులతో కలిసి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎస్‌జీటీలకు ప్రైమరీ హెచ్ఎంలుగా పదోన్నతులు కల్పించాలని కోరారు. ప్రభుత్వ నిర్ణయం వల్ల 1995, 96, 98 డీఎస్సీ ఉద్యోగులు పదోన్నతి అవకాశాలు కోల్పో తున్నారని చెప్పారు. 2002 స్కూల్ అసిస్టెంట్ ప్రమోటీలను సీనియారిటీ జాబితాలో 2002 డైరెక్ట్ రిక్రూట్స్ కంటే ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండలశాఖ అధ్యక్షుడు ఆర్.సింహాద్రి, ఏపీయూఎస్ జిల్లా నాయకుడు ఎస్.రమణ, బీటీఏ జిల్లా ప్రధాన కార్యదర్శి టీవీవీఎల్‌పి నరసింహం, ఎం.శ్రీనివాసరావు, ఎం.హేమ, పి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల్లేకుండా చర్యలు తీసుకోండి..

- మండల ప్రత్యేకాధికారి సాల్మన్ రాజు



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి సాల్మన్‌రాజు

బొండపల్లి: గ్రామాల్లో ఎటువంటి సమస్యల్లేకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులతో పాటు మండల స్థాయి అధికారులపై ఉందని మండల ప్రత్యేకాధికారి ఏవీ సాల్మన్‌రాజు అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి మూడో శనివారం తప్పనిసరిగా స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని పక్కాగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా నిర్వహించాలని సూచించారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ తులసీనాథ్, తహసీల్దార్ డోల రాజేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ ఎ.రఘుపతి రావు, తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తత తప్పనిసరి



వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కొత్తవలస: ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా వేతనదారులు అప్రమత్తంగా ఉండాలని వియ్యంపేట పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఎల్.సత్యారావు సూచించారు. మండలంలోని తుమ్మికాపల్లి గ్రామ పంచాయతీ శివారు సీతంపేట గ్రామం వద్ద గల చెరువులో ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులతో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేతనదారులు డీ హైడ్రేషన్‌కు లోనుకాకుండా ఉండేందుకు మజ్జిక, నిమ్మరసం, బార్లీ, కొబ్బరి నీళ్లు, ఓఆర్ఎస్ ద్రావణం వంటి ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఎండలో పనిచేసే సమయంలో కాళ్లకి చెప్పులు, తలకి తలపాగా ధరించాలని సూచించారు. మద్యం, పొగాకు, ఖైనీ వంటి అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. పని ప్రదేశంలో కచ్చితంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లతో సహా ఫస్ట్ ఎయిడ్ కిట్‌లు ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడు శంకర్, ఆరోగ్య సిబ్బంది పద్మావతి, ఈశ్వరరావు, తులసి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఆదాయం మెరుగుపరచడానికి ప్రణాళికలు



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం ఇందిర

దత్తిరాజేరు: పొదుపు సంఘాలలో ఉన్న మహిళలు ఆదాయం మెరుగు పరుచుకోవడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని వెలుగు ఏపీఎం ఇందిర అన్నారు. మండలంలోని కోమటిపల్లిలో 261 మంది పొదుపు మహిళలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సంఘ సభ్యులందరూ ఆర్థికంగా ఎదగాలంటే తీసుకున్న అప్పుతో వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ భాస్కరరావు, పలు గ్రామాల వీఓఏలు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో భేష్..

- ఇంటి వద్దే పురుడు పోసిన 108 ఈఎంటీ, పైలట్



తల్లీబిడ్డలను ఆస్పత్రికి తరలిస్తున్న సిబ్బంది

చీపురుపల్లి: దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఎంతో గొప్ప ఆశయంతో తీసుకొచ్చిన 108 అంబులెన్స్‌తో పాటు అందులో పని చేసే సిబ్బంది సేవలు ఎప్పటికప్పుడు వారి గొప్పతనాన్ని చాటి చెబుతున్న సంగతి తెలిసిందే. ఆపద సమయాల్లో ఉన్న వారి దగ్గరకు వెళ్లి క్షణాల్లో వారిని సమీపంలోని ఆస్పత్రిలో చేర్పించి ప్రాణాలు కాపాడిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. సరిగ్గా అలాంటి సంఘటనే బుధవారం రాత్రి చీపురుపల్లి మండలంలోని పీకే పాలవలస పంచాయతీ పరిధిలోని బెవరపేట గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గంట్యాడ లావణ్య అనే గర్భిణికి బుధవారం అర్ధరాత్రి ఒక్కసారిగా నొప్పులు ప్రారంభమయ్యాయి. దీంతో కుటుంబ సభ్యులు 108కు ఫోన్ చేయడంతో ఈఎంటీ జి.అనురాధ, పైలట్ సీహెచ్.తవిటినాయుడులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అయితే గర్భిణికి మూడో కాన్పు కావడం.. ఆస్పత్రికి తరలించేంత సమయం లేకపోవడంతో సిబ్బంది ఆమె నివాసంలోనే సాధారణ ప్రసవం జరపగా.. లావణ్య పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం తల్లీబిడ్డలను 108 వాహనంలో కర్లాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ప్రస్తుతం తల్లీబిడ్డలు ఆరోగ్యంగా ఉన్నారు. సకాలంలో స్పందించిన 108 సిబ్బందిని గ్రామస్తులు అభినందించారు.

విరగ్గాసిన మామిడి, పనస





వేపాడ: మండలంలో కొండగంగుబూడి పంచాయతీ ఎస్.కోట సీతారాంపురం గ్రామంలో విరగ్గాసిన మామిడి, పనస చెట్లు పలువురిని ఆకర్షిస్తున్నాయి. గ్రామానికి చెందిన శిరికి అప్పలసత్యనారాయణ, తదితరుల కళ్లంలో ఉన్న పనస చెట్టుకు విపరీతంగా కాయలు కాశాయి. అలాగే పక్కనే మరోరైతు ఇంటివద్ద మామిడి చెట్టు విరగ్గాసింది.

స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రపై సమీక్ష



మాట్లాడుతున్న నోడల్ అధికారి లక్ష్మీనారాయణ

వేపాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్రపై నోడల్ అధికారి పీఎస్‌వీ లక్ష్మీనారాయణ గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భవనాల్లో వేడిని తగ్గించేందుకు, జీవ వైవిధ్యాన్ని ప్రోత్సహించాడానికి పైకప్పు తోటల పెంపకాన్ని ప్రోత్సహించాలన్నారు. ప్రజలు సంచరించే ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వృద్ధులు, పిల్లలు ఎండలో బయట తిరగకుండా అవగాహన కల్పించాలని తెలిపారు. ఇంటి పన్నులు త్వరిగతిని వసూలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, ఈఓపీఆర్‌డీ రవికుమార్, పశువైద్యాధికారి, పీహెచ్‌సీ వైద్యాధికారులు, తదితర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

దేశ క్షేమం కోసం ప్రార్థించండి..

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి శ్రీనివాసరావు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

గంట్యాడ: దేశ క్షేమం కోసం ప్రతి ఒక్కరూ ప్రార్థనలు చేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి రేగాన శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని రామవరం సుధాకర్ చర్చిలో లోకల్ పాస్టర్స్ ఫెలోషిప్ సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా భారత్, పాకిస్తాన్‌లో జరిగిన యుద్ధంలో అమరులైన భారత జవానులకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అమరులైన కుటుంబాలకు దేవుడు మనోధైర్యం ఇవ్వాలని ఆకాంక్షించారు. సమావేశంలో ఎల్‌పీఎఫ్ అధ్యక్షుడు సత్యరాజు, సెక్రటరీ మధుసూదనరావు, బీఎం.మైనర్‌రాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు మధు ఐజక్, తదితరులు పాల్గొన్నారు.

19న ఎన్నిక

కొత్తవలస: మండల పరిషత్ పరిధిలో ఖాళీ అయిన కో ఆప్టెడ్ సభ్యుడి పదవికి ఈ నెల 19న మండల పరిషత్ భవనంలో ఎన్నిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో పనిచేసిన కో ఆప్టెడ్ సభ్యుడు గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందేనని పేర్కొన్నారు. దీంతో ఎన్నిక నిర్వహిస్తున్నామని, ఎంపీటీసీ సభ్యులందరూ ఆరోజు ఉదయం పది గంటలకు హాజరు కావాలని కోరారు.

వైభవంగా అమ్మవార్ల పండగలు



లక్కవరపుకోట : శ్రీరాంపురంలో ముత్యాలమ్మ ఘటాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

లక్కవరపుకోట / కొత్తవలస: గ్రామాల్లో అమ్మవార్ల పండగలను గురువారం అత్యతం వైభవంగా నిర్వహించారు. లక్కవరపుకోట మండలం శ్రీరాంపురం గ్రామంలో ముత్యాలమ్మ పండగ.. కొత్తవలస మండలం రాజుపాత్రునిపాలెంలో రావాలమ్మ పండగను ఘనంగా చేపట్టారు. ఈ సందర్భంగా అమ్మవారి ఘటాలను గ్రామ పురవీదుల్లో మేళాతాళాల మధ్య ఊరేగించారు. అమ్మవార్లకు తెల్లవారుజాము నుంచే పూజలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఘనంగా బంగారమ్మ పండగ..

శృంగవరపుకోట: మండలంలోని బొడ్డ వర పంచాయతీ అంబదాసుపాలెంలో బంగారమ్మ పండగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఘటాలను ఊరేగించారు. గిరిజనులు అత్యంత భక్తి శ్రద్ధలతో అమ్మవారికి పూజలు చేపట్టారు. రాత్రి పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



లక్కవరపుకోట : శ్రీరాంపురంలో మహిళల కోలాటం



ఎస్.కోట: ఘటాలతో భక్తులు



కొత్తవలస : రాజుపాత్రునిపాలెంలో పూజలందుకుంటున్న రావాలమ్మ

ఆర్థిక సాయం



అగ్ని ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం అందిస్తున్న ఎస్‌కోట డీజీఎం శివాజీ

వేపాడ: ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో పశువుల పాక, రెండు చూడి ఆవులు కోల్పోయిన బాధిత రైతు నిరుజోగి కృష్ణకు వేపాడ పాల సొసైటీ నుంచి రూ.15 వేలు అందజేశారు. సొసైటీ అధ్యక్షుడు నాగిరెడ్డి దేముడుబాబు అధ్యక్షతన గురువారం జరిగిన కార్యక్రమంలో బాధిత రైతుకు పాల సొసైటీ ఎస్.కోట యూనిట్ డీజీఎం శివాజీ చేతుల మీదుగా ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎం.నాయుడుబాబు, పీఎస్ గొర్లె సత్యారావు, గ్రామపెద్దలు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో నైతిక విలువలతో కూడిన విద్య

- ఏసీడీపీఓ లక్ష్మీబాయి



మాట్లాడుతున్న సహాయ సీడీపీఓ లక్ష్మీబాయి

లక్కవరపుకోట: అంగన్‌వాడీ కేంద్రాల్లో నైతిక విలువలతో కూడిన విద్య అందిస్తున్నట్లు ఏసీడీపీఓ లక్ష్మీబాయి తెలిపారు. వియ్యంపేట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని మల్లివీడు, సంతపేట సెక్టార్ పరిధిలో గల అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం తల్లికి వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులచే తల్లులకు పాదపూజ చేయించారు. అనంతరం ఏసీడీపీఓ లక్ష్మీబాయి మాట్లాడుతూ.. తల్లులు కూడా తమ చిన్నారులకు దేశభక్తికి సంబంధించిన అంశాలను వివరించాలన్నారు. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాల్లో కిశోర బాలికలకు సామాజిక అంశాలపై చైతన్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలువురు తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.